క్లుప్తంగా

వైఎస్సార్ బీమానగదు అందజేత



పిడుగురాళ్ల: అనారోగ్య సమస్యలతో పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పఠాన్ కరిముల్లా (47) మృతి చెందటంతో మృతుని భార్య రసూల్‌బీకి వైఎస్సార్ బీమా నగదును అందజేశారు. కార్పెయింట్ వర్క్ చేస్తూ జీవనం సాగించే పఠాన్ కరిముల్లా గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో రసూల్‌బీకి వైఎస్సార్ బీమా ద్వారా మట్టిఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును 10వ వార్డు కౌన్సిలర్ షేక్ అబ్దుల్లా చేతుల మీదుగా అందజేశారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగ సంఘం నాయకుడు దాసరి వెంకట్, వలంటీర్లు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన

గురజాల : పంట కోత ప్రయోగం చేయాలని డీవైఎస్‌ఓ ఎండీ అయ్యుబ్ సూచించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగం చేయడం వలన ఎకరాకు ఎంత దిగుబడి వస్తుందో గమనించవచ్చన్నారు. ఈ క్రాప్ నమోదు అయినటువంటి రైతులందరకీ భౌతిక రశీదులు అందించాలన్నారు. పంటకోత ప్రయోగాల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వీఏఓలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో స్పటిక శివలింగం గ్రామోత్సవం

రెంటచింతల: సత్రశాల వద్ద పవిత్ర కృష్ణానది తీరాన వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలోని అభిషేక మండపంలో పవిత్రమైన స్పటిక లింగాన్ని ఈ కార్తీకమాసంలో ఏర్పాటు చేయనున్నట్లు సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూ.2.80 లక్షల వ్యయంతో ఈ స్పటిక లింగం తయారు చేయించి రెంటచింతల గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక పౌర్ణమి రోజు భక్తులను స్పటిక శివలింగం దర్శనం చేసుకోవడానికి అనుమతించడం జరుగుతుందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి : పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి నడికుడి మార్కెట్ యార్డు సమీపంలో జరిగింది. సుమారు 52 సంవత్సరాల వయస్సున్న యాచకుడిగా పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ డి.శివనాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాచకుడు దాచేపల్లి పరిసర ప్రాంతాల్లో కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఒక ప్రమాదంలో కాలు తీవ్రంగా గాయపడింది. గురువారం రాత్రి ఓ పెట్రోల్ బంకులో పెట్రోలు కొనుగోలు చేసి మద్యం మత్తులో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఎస్‌ఐ శివనాగరాజు ఘటన స్థలంలో మృతదేహం పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గురజాల : ఈనెల 19వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక చల్లగుండ్ల గార్డెన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర కంటి వైద్య నిపుణులు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, సైదులు తదితరులున్నారు.

పగటి వేషగాళ్లు ఎవరో ప్రజలకు తెలుసు

ముప్పాళ్ళ: పగటి వేషగాళ్లు ఎవరో ప్రజలకు తెలుసునని, సామాజిక సాధికార బస్సు యాత్ర గురించి విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ చావా రమేష్‌లు అన్నారు. ముప్పాళ్ళలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లి టీడీపీ నాయకులు స్థాయి మరిచి విమర్శలు చేస్తున్నారనే సంగతి తెలుసుకుంటే మంచిదన్నారు. బీసీలను వంచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అందుకు ఉదాహరణే నిమ్మకాయల రాజనారాయణకు చేసిన ద్రోహం అన్నారు. మీరు మోసం చేస్తే వైఎస్సార్‌సీపీ ఆదరించి గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని కట్టబెట్టిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గంజి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



మాచర్లలో నాగేంద్ర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు





పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో నాగుల గుడిలోని మూలవిరాట్

దాచేపల్లి : నాగుల చవితి పండుగ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపురంలోని నాగేంద్రస్వామి దేవాలయానికి భక్తులు తెల్లవారుజాము నుంచే చేరుకున్నారు. నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. దాచేపల్లిలోని నాగేంద్రస్వామి దేవాలయంలో కూడా నాగుల చవితి సందర్భంగా పూజలు నిర్వహించారు.

ఘనంగా నాగులచవితి

విజయపురిసౌత్: నాగులచవితి పండుగ వేడుకలు శుక్రవారం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు స్థానిక నాగేంద్రస్వామి దేవాలయం, పేటేరు అమ్మవారి దేవాలయం, డౌన్‌మార్కెట్, సాగర్‌క్యాంప్ వద్ద ఉన్న పుట్టలలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నాగేంద్రస్వామి దేవాలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు...

గురజాల : నాగుల చవితి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా నాగులచవితి వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో నాగుల చవితిని పురస్కరించుకొని స్వామివారి మూల విరాట్‌ను ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అదేవిధంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న నాగుల గుడి దేవస్థానంలో భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు.

నాగేంద్రుని పూజలకు పోటెత్తిన భక్తులు

మాచర్ల: నాగుల చవితి సందర్భంగా పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో వేంచేసి ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో నాగేంద్రస్వామి పుట్ట వద్ద దాదాపు రెండు వేల మంది భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి నాగేంద్రుడికి పూజలు చేశారు. అంతకు ముందు దేవాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మహిళలు పూజలు జరిపారు. భక్తుల రాకతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దేవాలయం కిటకిటలాడింది. నాగులచవితి నాడు నాగేంద్రునికి పాలు పోసేందుకు భక్తులు పోటెత్తారు.



దాచేపల్లిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



డౌన్‌మార్కెట్ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

న్యుమోనియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కొత్త రామకృష్ణ, డాక్టర్ గీతాంజలి, తదితరులు

సత్తెనపల్లి: చిన్నపిల్లల్లో న్యుమోనియా లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించటం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు అని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో న్యుమోనియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిన్నపిల్లలు న్యుమోనియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పిల్లల వార్డులో, ప్రసూతి విభాగాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల అందరికి అవగాహన ఏర్పడి జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి గీతాంజలి మాట్లాడుతూ ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ హాస్పిటల్‌లో చిన్న పిల్లలు, గర్భిణులకు అవగాహన కల్పించడం వల్ల వ్యాధిని ఆదిలోనే అరికట్టవచ్చన్నారు. హాస్పిటల్ మొత్తం తిరిగి చూసి హాస్పిటల్ ఎంతో అభివృద్ధి చెందిన పారిశుద్ధ్య నిర్వహణ కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి, పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగపద్మజ, డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్ సుజాత, పిల్లల డాక్టర్ ప్రేమ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ, సిబ్బంది ఉన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ దీప్తి



పాఠశాల విద్యార్థులచేత ఐరన్ టాబ్లెట్స్ మింగిస్తున్న డాక్టర్ దీప్తి

అచ్చంపేట: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ దీప్తి తెలిపారు. మండలంలోని తాళ్లచెరువు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. బాలింతల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆర్‌సీఎం ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులచేత ఐరన్ టాబ్లెట్స్ మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు గర్భందాల్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యశాలలో ప్రసవించడం ఆరోగ్యకరమని సూచించారు. ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా పరీక్షలు నిర్వహించి రక్తహీనత గలవారికి టాబ్లెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునీల, పాఠశాల హెచ్ఎం తుమ్మా శౌరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ మరియకుమారి, ఆశా వర్కర్ మరియరాణి, ఉపాధ్యాయురాలు జోజమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు జిరాక్స్ మిషన్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు రూ.40 వేల విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను మేడికొండ ఆంజనేయులు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, ఉపాధ్యాయులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తు సోపానాలు



మాదల(ముప్పాళ్ళ): వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తుకు ఉపాధి సోపానాలు అని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ రమేష్ తెలిపారు. మండలంలోని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వృత్తి విద్యలో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థినులు వెర్నెట్‌స్కిల్స్ ఆధ్వర్యంలో దూళిపాళ్ళలోని రాయని స్పిన్‌టెక్స్ మిల్లుకు ఇండస్ట్రియల్ విజిట్ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మిల్లులో దారం తయారీ, మిషనరీ గురించి నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిల్లు జనరల్ మేనేజర్ వి.ఆనంద్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వృత్తివిద్యా టీచర్స్ వి.రామాంజనేయులు, కేడీఎల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రామ్‌లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు భూసార పరీక్షల విధానంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులే వారి పొలంలో మట్టి నమూనాను సేకరించి, భూసార పరీక్షకు పంపడంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపర్లపై టీడీపీ నేత దాడి

దుర్గి: మచిలీపట్నం ప్రాంతానికి చెందిన శివకుమార్, మరో ముగ్గురు కలిసి మండల పరిధిలోని అడిగొప్పల గ్రామ శివారు పొలాల్లో గొర్రెలను మేపుకుంటున్నారు. అడిగొప్పల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేత పువ్వాడ రామలింగం తన పొలంలో పంట నష్ట పరిచారంటూ శుక్రవారం వారిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో శివకుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక తనిఖీలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి



దాచేపల్లి : సామాజిక తనిఖీలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎస్సార్పీ బుజ్జి అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.7కోట్ల వ్యయంతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు చేపట్టేందుకు డీఆర్పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్ శిక్షణ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా సామాజిక తనిఖీలు చేపట్టాలని, చేపట్టిన పనులు, భవనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్సార్పీ బుజ్జి చెప్పారు. జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, ఏపీవో మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

రేపు నీలంపాటి అమ్మవారి తిరునాళ్లు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీనీలంపాటి అమ్మవారి తిరునాళ్ల వేడుకలు ఈనెల 19న ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ మద్దినేని హరిబాబు శుక్రవారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా దేవాలయాన్ని సుందరంగా అలంకరించినట్లు ఆయన వెల్లడించారు.

రేపు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం ఘంటసాల స్వర నీరాజనం పేరిట 12 గంటల పాటు నిర్విరామ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బుల్లెట్ వాహనం చోరీ

చిలకలూరిపేటటౌన్: ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన ఆలశ్యంగా వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ ఐదో లైన్‌కు చెందిన కంచర్ల అజయ్‌కుమార్ గ్యాస్ స్టౌవ్ టెక్నీషియన్‌గా జీవనం కొనసాగిస్తుంటాడు. గత నెల 8వ తేదీ ఇంటి ముందు బుల్లెట్ వాహనం పార్క్ చేసి ఇంట్లో నిద్రిస్తుండగా బైక్ చోరీకి గురయింది. ఈ విషయంపై శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిశ యాప్ రిజిస్ట్రేషన్

బొల్లాపల్లి : జిల్లా ఎస్పీ ఆదేశానుసారం దిశ యాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. బండ్లమోటు ఎస్సై డి. చెన్నకేశవులు ఆధ్వర్యంలో మండలంలోని బొల్లాపల్లి, మేళ్ళవాగు కూడలిలో పోలీస్ సిబ్బంది దిశ యాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. మహిళల భద్రత, రక్షణ కోసం దిశ యాప్ రిజిస్ట్రేషన్ ఉపయోగకరమని ఎస్సై తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే సహించం

ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి



తనిఖీ నిర్వహిస్తున్న ఏవో శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: నకిలీ ఎరువులను రైతులకు విక్రయిస్తే సహించేది లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ, మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని, అది కూడా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎరువులను విక్రయించాలని సూచించారు. రైతులకు కొనుగోలు రసీదు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే సహించమని అన్నారు. అనంతరం పలు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థులతో గ్రంథాలయ అధికారి, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎంపీపీ స్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నాల్గొవ రోజు కొనసాగాయి. నాల్గొవ రోజు కవి సమ్మేళనం నిర్వహించగా పట్టణంలోని పలువురు కవులు హాజరై గ్రంథాలయం గొప్ప తనం గురించి వివరించారు. అనంతరం పట్టణంలోని ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు క్విజ్, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రక్కునాయక్, పి.స్వామి, కె.రాజశేఖర్, గ్రంథాలయ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాలు



అన్నదాన కార్యక్రమం దృశ్యం

మాచర్ల: కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయం, సొసైటీ కాలనీలోని మాతాన్నపూర్ణేశ్వరి దేవాలయం, శ్రీశైలం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం, కోదండ రామాలయాలలో వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కేసీపీ రహదారిలో కనకదుర్గా దేవాలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ స్వామి మాలలు ధరించిన స్వాములకు అన్నదానం నిర్వహించారు.

అనాథలకు అన్నదానం

మాచర్ల: పట్టణంలో గత నాలుగు సంవత్సరాలుగా అనాథలు, యాచకులకు అన్నదానం చేస్తున్న రామకృష్ణా సేవా సమితి స్వామి వివేకానంద అనాథాశ్రమ నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వంద మందికి అన్నదానం చేశారు. బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్, చెన్నకేశవ దేవాలయ ప్రాంతం రైలు గేటు పక్కన నిరుపేదలకు నెహ్రూ నగర్ ప్రాంతంలో అన్నదానం నిర్వహించారు. కార్యాక్రమంలో రామకృష్ణా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అక్షింతల కలశం ఊరేగింపు



అక్షింతలను పట్టణంలో ఊరేగిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల) : అయోధ్యలో జనవరిలో జరగనున్న శ్రీరామచంద్రుని దేవాలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని పవిత్ర అక్షింతలు దేశంలోని అన్ని ప్రాంతాల భక్తులకు అందేవిధంగా శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం శుక్రవారం వినుకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా పవిత్ర అక్షింతలతో కూడిన కలశాన్ని మంగళవాయిద్యాలతో ఊగిరేంపుగా శ్రీరాముని భజనలతో పట్టణంలోని రంగనాయక స్వామి దేవస్థానం నుంచి మెయిన్ బజారు, బోసు బొమ్మ సెంటర్, కోదండ రామాలయం, శివయ్య స్థూపం సెంటర్ మీదుగా కొత్తపేట శ్రీ పట్టాభి రామాలయంకు చేర్చడం జరిగింది. ఆ పవిత్ర అక్షింతలను వివిధ గ్రామాలు, పట్టణాల్లోని భక్తులకు ప్రతి ఇంటికి స్వామి వారి ఆశీస్సులు అందాలని పంపడం జరుగుతుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, హిందూ బంధువులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు జె.రాజేశ్వరి, కె. సుబ్బారావు, ఎం. కృష్ణాంజనేయులు, గట్టుపల్లి కాశీ, గజవల్లి నాగపవన్, మల్లికార్జున, జి. బాలరావు, ప్రకాష్, నాగాచారి, ప్రసాద్, భద్రయ్య, సుబ్బారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కారుమంచిలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు



కారుమంచి మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ ప్రమీల

శావల్యాపురం: మండలంలోని కారుమంచి ప్రభుత్వ మద్యం దుకాణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన షాపులో అమ్మిన మద్యం సీసాలకు సంబంధించిన చలానా ఈ నెల16వ తేదీ మధ్యాహ్నానికి చెల్లించకపోవటంతో అనుమానం వచ్చి మద్యం దుకాణాన్ని తనిఖీ చేయించినట్లు ఎక్సైజ్ సీఐ మున్నంగి ప్రమీల వెల్లడించారు. అయితే సూపర్‌వైజరు లేకపోవటంతో పాటు మద్యం సీసాల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించామనీ, దుకాణంలో 32,150 సీసాలు ఉండాల్సి ఉండగా 28 వేల 650 సీసాలు మాత్రమే ఉన్నట్లు తనిఖీల్లో నిర్ధారణ అయిందన్నారు. మిగిలిన సీసాలను బార్ కోడ్ లేకుండా అక్రమంగా అమ్మినట్లు గుర్తించామని వీటి విలువ రూ. 5 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. అయితే సూపర్‌వైజరు కుటుంబ సభ్యులు కొంతమేర జమ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీలు చేసిన వారిలో ఎక్సైజ్ ఎస్ఐ రంగిశెట్టి పూర్ణచంద్రరావు, సిబ్బంది మల్లావరపు కోటేశ్వరరావు ఉన్నారు.

26న యూటీఎఫ్ పల్నాడు జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పల్నాడు జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 26వ తేదీన గురజాల చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు, ఆర్. అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం. పోలయ్య, జి.నాగరాజు, ఐదు మండలాల నాయకులు బి.భాస్కరరావు, వి.నాగేశ్వరరావు, డి.రవికుమార్, పి.రమేష్‌బాబు, పీపీ జిలానీ, బి.రామునాయక్, డి.మస్తాన్, సీహెచ్. మల్లికార్జున, డి.కోటేశ్వరరావు, ఐ.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.